సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



**ఘనంగా రక్షాబంధన్** 8లో

జిల్లా వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికారులకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు.



**వైభవంగా ఆలయ ప్రారంభం**

ముంచంగిపుట్టులో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. 8లో



**మన్యంలో భారీ వర్షం**

జిల్లా కేంద్రం పాడేరుతో పాటు పలు మండలాల్లో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. 8లో

## విషాహారంతో విషాదం

# పాపం పసివారు!



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

- ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ముగ్గురు చిన్నారుల మృతి
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 35 మంది
- ఫంక్షన్లో మిగిలిపోయిన బిర్యానీ పెట్టడమే కారణం
- అస్వస్థతకు గురైనా.. స్పందించని ట్రస్ట్ నిర్వాహకుడు
- కారణం చెప్పకుండా ఇళ్లకు పంపించేయడంతో దారుణం



విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కలుషిత ఆహార బాధితులు



విశాఖ కేజీహెచ్‌కు చేరుకున్న బాలికను ఎత్తుకొని వార్డుకు చేరుస్తున్న సిబ్బంది

**అభం శుభం తెలీని గిరిజనులు వారు.. అభివృద్ధికి, విద్యావకాశాలకు దూరంగా బతుకుతున్నారు.. తమ బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని ఆశ పడ్డారు.. మిషనరీ సంస్థ, మైదాన ప్రాంతంలో నడుపుతున్న హాస్టల్లో వారిని చేర్చారు. చక్కగా చదువుకొని పైకి వస్తారన్న నమ్మకంతో ఉన్న సమయంలో అస్వస్థతతో చిన్నారులు ఇంటికి తిరుగు ముఖం పట్టారు. గంటలు గడిచేలోగానే వారి పరిస్థితి విషమించడంతో గిరిజనం బెంబేలెత్తిపోయారు. ముగ్గురు చిన్నారులు విగత జీవులు కావడంతో మన్యం మూగబోయింది. చికిత్స పొందుతున్న 35మంది పిల్లలు క్షేమంగా ఇంటికి తిరిగిరావాలని కన్నీటితో వేడుకుంటోంది.**

**కోటవురట్ల/నర్సీపట్నం/మహారాణిపేట (విశాఖ):** క్రైస్తవ ట్రస్ట్ నిర్వాహకుల నిర్లక్ష్యం ముగ్గురు చిన్నారుల ప్రాణాలను బలి తీసుకుంది. వారి తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చింది. ఓ ఫంక్షన్లో మిగిలిపోయిన బిర్యానీని పెట్టడం వల్లే పిల్లలు అస్వస్థతకు గురైనట్లు తెలిసినా నిర్వాహకులకు పట్టలేదు.వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న పిల్లల్ని కనీస బాధ్యత లేకుండా తల్లిదండ్రులకు అప్పగించి చేతులు దులిపేసుకోవాలనుకున్నారు. ఈ నిర్లిప్తతే ముగ్గురి ప్రాణాల్ని పొట్టనబెట్టుకుంది. ఉమ్మడి విశాఖలో కలకలం రేపిన ఈ విషాదకర ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో సోమవారం జరిగింది. వివరాలివి.. పాస్టర్ ఎం.కిరణ్‌కుమార్ పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) చర్చిని 13 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పాసా ట్రస్ట్ పేరిట ఎలాంటి అనుమతుల్లేకుండా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లి, కొయ్యూరు తదితర మండలాలకు చెందిన 86 మంది పిల్లలు ఇక్కడ ఆశ్రయం పొందుతూ, సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం పందూరు గ్రామంలో లోవరాజు అనే వ్యక్తి ఇంట్లో ఓ కార్యక్రమం జరిగింది. అక్కడ మిగిలిపోయిన వెజ్ బిర్యానీని రాత్రి ఆశ్రమ పిల్లలకు పెట్టారు. దీంతో పాటు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అందించిన సమోసాలను కూడా విద్యార్థులకు అందించారు. వీటిని తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి (తెల్లవారితే ఆదివారం) 2 గంటల ప్రాంతంలో 5గురు పిల్లలకు వాంతులు, విరేచనాలయ్యాయి. మళ్లీ వేకువజాము 4 గంటల సమయంలో మరో 21 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. వారికి స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇళ్లకు పంపించేశారు. ఇళ్లకు వెళ్లినవారిలో కొందరి పరిస్థితి విషమించడంతో పాడేరు, చింతపల్లి, కొయ్యూరు, నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. కొయ్యూరు మండలం డౌనూరు ఆస్పత్రిలో 18 మందిని చేర్చగా, అందులో పరిస్థితి సీరియస్‌గా ఉన్న నలుగురిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డౌనూరు ఆస్పత్రిని ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించి అనారోగ్యానికి గురైన బాలికలతో మాట్లాడారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 15 మంది చేరగా వారిలో ఆరుగురి పరిస్థితి విషమించడంతో వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌కు మొత్తం 14 మందిని తీసుకొచ్చి, చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనలో కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ రెల్లలపాలేనికి గెమ్మెలి నిత్య(భవాని)(8), చింతపల్లి మండలం తిరుమల పంచాయతీ నిమ్మలపాలేనికి చెందిన తంబెలి జాషువా(7), చింతపల్లి మండలం బలభద్రకు చెందిన కొర్రా శ్రద్ధ(7) మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అనకాపల్లి జేసీ జాహ్నవి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ఆశ్రమాన్ని ఎన్నేళ్లుగా నడుపుతున్నారు? అనుమతులపై ఎంఈవో రామారావును ప్రశ్నించారు. అనుమతి లేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఇలా అనుమతి లేకుండా ఎన్ని ఆశ్రమాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఇదొకటే అని చెప్పడంతో కచ్చితంగా చెప్పగలరా అంటూ ఆగ్రహించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. నక్కపల్లి సర్కిల్ సీఐ అప్పన్న విచారణ చేపట్టి నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్డీవో వి.జయరాం, ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సంఘటన స్థలంలో విచారణ జరిపి, వివరాలు సేకరించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఉన్నతస్థాయి కమిటీ విచారణకు సీఎం ఆదేశించినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు.

### 14 మందికి కేజీహెచ్‌లో చికిత్స

అస్వస్థతకు గురైన 14 మంది పిల్లలను పలు అంబులెన్స్‌ల్లో కేజీహెచ్ పిల్లల వార్డుకు తీసుకొచ్చారు. వీరికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఎస్.రవి(8), కె.శశాంక్(8), టి.అలియా(7), ఎం.నవీన్(10), కె.నాగేశ్వరి(12), కె.మీరా(10), టి.గీత(9), జి.జోసెఫ్(7), పి.జెస్సికా(8), పి.అరవింద్(7), పి.జ్యోతి(8), పి.మౌనిక(7), పి.స్వప్న(8), పి.మౌనిక(3)లకు చికిత్స అందుతోంది. వీరిలో పి.జెస్సికా బీపీ డౌన్ అవుతోందని, ప్రస్తుతానికి ఆక్సిజన్ పెట్టినట్లు వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన పిల్లలకు కేజీహెచ్‌లో అందుతున్న సేవలను విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ దగ్గరుండి పర్యవేక్షించారు. పిల్లలతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందుతుందని భరోసానిచ్చారు. కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను రాష్ట్ర హోం మంత్రి వి.అనిత, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకుడు పి.ఎల్.ఎన్.మాధవ్, రవికుమార్ తదితరులు పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

### ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌కు రిమాండ్



**సాక్షి, అనకాపల్లి:** కోటవురట్ల కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్ట్ నడుపుతున్న ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని ఎస్పీ దీపికా పాటిల్ సోమవారం రాత్రి మీడియాకు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఇందులో ఇంకెవరున్నా వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ విచారణలో డొనేషన్ ఇచ్చిన బిర్యానీ ఫుడ్‌ను రాత్రి డిన్నర్‌లో పెట్టడం.. ఫుడ్ పాయిజన్ అయి వాంతులు, విరోచనాలతో గురైన వెంటనే ఆస్పత్రికి పంపించకుండా నిర్వాహకుడు వారి తల్లిదండ్రులకు అప్పగించడం మరణాలకు దారి తీసినట్టు తేలిందన్నారు. అంతేకాకుండా ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా అనధికారికంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి హాస్టల్‌గా నడుపుతున్నట్లు తేలిందన్నారు. కిరణ్‌కుమార్‌పై పాత సెక్షన్ 304, కొత్త సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఇలా ఏజెన్సీ ప్రాంతం నుంచి విద్యార్థులను తీసుకొచ్చి అనధికారింగా ట్రస్టుల పేరిట హాస్టళ్లు ఏర్పాటు చేస్తే అలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**దుర్ఘటనపై నివేదిక అందించండి: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం**

**అనకాపల్లి:** కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఫుడ్‌పాయిజన్ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆశ్రమానికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా, దీనికి గల కారణాలపై నివేదిక అందించాలన్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



డౌనూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

## నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..

విషాహారం తిని అస్వస్థతకు గురైన చింతపల్లి మండలానికి చెందిన పిల్లల్ని వారి తల్లిదండ్రులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. కిటుముల పంచాయతీ సర్పంచ్ గెమ్మిలి రమణమ్మ విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలిచారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి, వైద్యులు వికాస్, లత, రాజు, సువర్ణ సత్వర వైద్య సేవలు అందించి, మెరుగైన చికిత్సకు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆర్డీవో జయరాం ఆస్పత్రిలోనే ఉండి వైద్య సేవల్ని పర్యవేక్షించారు.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలపై సూచనలిస్తున్న జేసీ జాహ్నవి

**కొయ్యూరు/చింతపల్లి:** విషాహారం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు చిన్నారుల తల్లిదండ్రులు అంతులేని శోకంతో తల్లడిల్లిపోయారు. వారి కంట కన్నీరు ఏరులై పారింది. గెమ్మెలి నిత్య మృతితో ఆమె స్వగ్రామం రెల్లలపాలెంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన గెమ్మెల సత్యారావు, గెమ్మెల కుమారికి ముగ్గురు సంతానం. వీరిలో నిత్య.. క్రైస్తవ మిషనరీలో చదువుకుంటోంది. ఆమెకు బాగోలేదని శనివారం రాత్రి తమకు ఫోన్ రావడంతో వెంటనే అక్కడికి వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి తీసుకువచ్చామని వారు తెలిపారు. ఉన్నట్టుండి నిత్యకు వాంతులు, విరోచనాలు కావడంతో ఆరోగ్యం విషమించిన కాసేపటికి మృతి చెందిందని తెలిపారు. 'కూతురు బాగా చదువుకుని ఉద్యోగం చేసుకుంటాదని అక్కడికి పంపించామని..అందనిలోకాలకు వెళ్లిపోయి తమకు గర్భశోకం మిగిల్చిందని వారు రోదించారు.

### విషాదఛాయలు

చింతపల్లి మండలానికి చెందిన కిటిమల పంచాయతీ నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలు జుషువా (6), బలభద్రం గ్రామానికి చెందిన కొర్రా శ్రద్ధ (6) అనారోగ్యానికి గురయ్యారని క్రైస్తవ మిషనరీ సంస్థ నుంచి ఫోన్ రావడంతో కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం బయలుదేరి వెళ్లి తీసుకువచ్చారు. ఇంటికి తీసుకువచ్చిన తరువాత ఆదివారం రాత్రి ఇరువురు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలు నర్సింగ్, చిలకమ్మ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు జాషువా. చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్న ఆశతో అక్కడి పంపించామని, ఇలా జరుగుతుందని ఊహించలేదని తల్లిదండ్రులు నర్సింగ్, చిలకమ్మ రోదించారు. బలభద్రం గ్రామానికి చెందిన కొర్రా అప్పారావు, ముత్తా దంపతులకు ఐదుగురు సంతానం. పెద్దకుమార్తె సామిని, రెండో కుమార్తె శ్రద్ధ కైలాసపట్నంలోని క్రైస్తవ మిషనరీలో చదువుతున్నారు. కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురికావడంతో ఇద్దరిని తల్లిదండ్రులు ఆదివారం ఇంటికి తీసుకువచ్చారు. శ్రద్ధ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందింది. జాషువా, శ్రద్ధ మృతదేహాలను స్థానిక ఏరియా ఆస్పత్రికి సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు. అయితే ఇక్కడికి శ్రద్ధ తండ్రి అప్పారావు మాత్రమే వచ్చాడు. కుమార్తె మరణంతో తల్లడిల్లిపోయాడు. ఇదే ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన అంజలి శనివారం పంచాయతీ చక్కరాయిబంద గ్రామానికి చెందిన కిల్లో జ్యోతిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేనందున అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల మేర డోలీలో గెత్తపాకల సమీపం వరకు తీసుకువచ్చి ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

## రక్త కన్నీరు



మృతదేహం వద్ద రోదిస్తున్న శ్రద్ధ తల్లిదండ్రులు



కిల్లో జ్యోతిని ఆస్పత్రికి తరలించేందుకు డోలీలో తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## కడుపు నొప్పి అన్నప్పుడే.. అప్రమత్తమైతే..!

- ఆ ముగ్గురూ మృత్యువాత పడేవారే కాదు
- ఫుడ్ పాయిజనై 24 గంటల సేపు ఆస్పత్రి ఊసే లేదు.
- సంఘటన నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన నిర్వాహకుడు
- బిర్యాని తిన్న అర్ధరాత్రి ఐదుగురు చిన్నారులకు అస్వస్థత
- మరుసటి రోజు మరో 20 మందికి వాంతులు, విరేచనాలు
- ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఇంటికెళ్లేసరికే పరిస్థితి విషమం



పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన సంస్థ నిర్వహిస్తున్న ఆశ్రమం (ఇన్‌సెట్‌లో) నిర్వాహకుడు కిరణ్‌కుమార్

**సాక్షి, అనకాపల్లి/కోటవురట్ల:** పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన(పాసా) ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్ నిర్లక్ష్యం, తప్పించుకునే ధోరణే విద్యార్థుల మృతికి కారణమైంది. శనివారం ఫంక్షన్‌లో మిగిలిన బిర్యానీని పిల్లలు తిన్నాక, అదేరోజు అర్ధరాత్రి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అప్పుడే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించి ఉంటే ఆ చిన్నారుల ప్రాణాలు నిలిచేవి. మొట్టమొదట అస్వస్థతకు గురైన ఐదుగురిలో ముగ్గురు మృత్యువాత పడగా, మరో విద్యార్థి జెస్సికా విషమ పరిస్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది.

### నిర్లక్ష్యమే బలి తీసుకుంది

ఫుడ్ పాయిజన్ లక్షణాలతో 24 గంటలపాటు ఆ చిన్నారులు మృత్యువుతో పోరాడారు. సకాలంలో వారికి వైద్యం అందించి ఉంటే ప్రాణాపాయం తప్పేది. రెండోసారి మరి కొందరు అస్వస్థతకు గురైనప్పుడైనా స్పందించలేదు. అస్వస్థతకు గురైన పిల్లలంతా ఒకే చోట లేకుండా తల్లిదండ్రుల్ని పిలిచి, వారికి అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు కేవలం తమ బిడ్డకే ఇలా జరిగిందనుకుని, ఇంటికి తీసుకెళ్లారు. నిర్వాహకుడు తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేసే ప్రయత్నమే ఇంత మంది పిల్లల్ని ఇబ్బందిలో పెట్టింది. పాసా ట్రస్ట్ పేరిట 13 ఏళ్లుగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా దీన్ని నడుపుతున్నా ఏనాడూ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పోలీసులు దృష్టిసారించలేదు. ఇక్కడ మూడేళ్ల పిల్లలు కూడా ఉన్నారు.

## 86 మంది పిల్లలు.. ఒకటే గది!

ఒక రేకుల షెడ్ నిర్మించి, అందులోనే చింతపల్లి, పాడేరు, కొయ్యూరు మండలాలకు చెందిన 86 మంది పిల్లలకు వసతి కల్పించారు. వీరిలో 40 మంది బాలికలున్నారు. 10 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికలు ఐదుగురున్నారు. బాలికలకు మూడు మరుగుదొడ్లున్నా, రాత్రుళ్లు అందరూ ఒకేచోట పడుకోవాల్సిందే. పాస్టర్ కిరణ్‌కుమార్ గతంలో కోటవురట్ల మండలం గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో చర్చి ఏర్పాటు చేశారు. ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో గిరిజనులు తరిమేశారు. అక్కడి నుంచి కైలాసపట్నం వచ్చి పాసా ట్రస్టును నెలకొల్పాడు. కట్టుబట్టలతో వచ్చిన పాస్టర్ కొద్ది కాలంలోనే విలాసవంతమైన జీవితానికి మారినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యానారాయణ, చవ్వాకుల చిన్న తీవ్రంగా ఖండించారు. నిర్వాహకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అనధికారిక ఆశ్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎంపీటీసీకి వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

- స్పందించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి
- పార్టీ తరఫున రూ.లక్ష విలువైన చెక్కు అందజేత

**చింతపల్లి:** స్థానిక సెగ్మెంట్–2 ఎంపీటీసీ సభ్యురాలు చింతాడ జయలక్ష్మికి వైఎస్సార్‌సీపీ తరఫున రూ.లక్ష విలువైన చెక్కును సోమవారం అందజేశారు. ఆమె భర్త ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన పార్టీ తరఫున తక్షణ సాయం అందించాలని ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను)ను ఆదేశించారు.



చిన్న శ్రీను చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న ఎంపీటీసీ జయలక్ష్మి

ఈ మేరకు విజయనగరంలోని ఆయన స్వగృహంలో ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మికి రూ.లక్ష విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు ఎంపీటీసీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చింతపల్లి ఎంపీపీ అనూషదేవి పాల్గొన్నారు.

## జీడీపీ పెంపునకు కార్యాచరణ: కలెక్టర్

**సాక్షి,పాడేరు:** జీడీపీలో 2029 నాటికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లా కార్యాచరణను ఈనెలాఖరులోగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో సీపీవో ఆధ్వర్యంలో నిర్వహించిన జీడీపీపై ఒరియెంటేషన్‌లో ఆయన మాట్లాడారు. జీడీపీలో ఐదవ స్థానంలో ఉన్న దేశాన్ని 2047 నాటికి మూడవ స్థానంలోకి తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రాథమిక సెక్టార్లు అయిన వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, పారిశ్రామిక, ఆర్థిక, విద్య, సేవా, పర్యాటక రంగాల్లో 15శాతం వృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీపీవో ఎస్ఎస్ఆర్‌కే పట్నాయక్, పలు శాఖల అధికారులు ఎస్‌బీఎస్.నందు, రమేష్‌కుమార్‌రావు, శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణారావు,వాణిధర్,దాసు పాల్గొన్నారు.

## డోలీలో రోగి తరలింపు

**జి.మాడుగుల:** మండలంలో వంతాల పంచాయతీ కాగులబందకు రోడ్డు సౌకర్యం లేనందున అనారోగ్యానికి గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామానికి చెందిన పాంగి సుబ్బారావు అనారోగ్యానికి గురయ్యాడు. అతనిని ఆదివారం సాయంత్రం ఆరు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలపై నుంచి ఆరు కిలోమీటర్ల మేర డోలీలో రోడ్డు వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## రూ.50 లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- చింతపల్లి ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్
- మృతుల కుటుంబాలకు పరామర్శ

**చింతపల్లి:** కలుషిత ఆహార ఘటనలో మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మృతి ప్రభుత్వ హత్యలుగానే భావించాలని, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ముగ్గురు మృతికి కారణమైందన్నారు. కనీసం ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వల్లే మరణాలకు కారణంగా భావిస్తున్నామన్నారు. చింతపల్లి ఆస్పత్రిలో వైద్యాధికారులు లేక ఇబ్బందులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలకు పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఆయన డీఎంహెచ్‌వోను ఫోన్‌లో ప్రశ్నించారు. చింతపల్లి ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలోనిదని, వారిని సంప్రదించాలని ఆయన చెప్పడంతో ఆగ్రహానికి గురయ్యారు. ఎంపీపీ అనూషాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

## క్లుప్తంగా

### ఉపాధ్యాయునికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు

**చింతపల్లి:** ద్విచక్ర వాహనం బోల్తాపడి ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలం లోని కొత్తపాలెం పంచాయతీలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. జున్నుల మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధు లు నిర్వర్తిస్తున్న జుర్ర బెన్నా స్వామి మండల విద్యా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వస్తున్న క్రమంలో బోంగూడ గ్రామ సమీపంలో గేదెను తప్పించబోయి ద్విచక్ర వాహనం (స్కూటీ) అదుపు తప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన ఉపాధ్యాయుడ్ని స్థానికులు హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి సాయికృష్ణ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### నలుగురు గంజాయి నిందితుల అరెస్టు

- 4 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయి నిందితులతో ఎస్‌ఐ వెంకటరమణ

**చింతపల్లి:** ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని లంబసింగి జంక్షన్ వద్ద సోమవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా, రెండు అనుమానిత వాహనాలను పట్టుకుని తనిఖీ చేయగా, నాలుగు కేజీల గంజాయితో పట్టుకున్నామన్నారు. బెంగళూరుకు చెందిన నిందితులు గోపిరాజు (33), నాగేష్ (21), కార్తీక్ (21), చిరాగ్(21)లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# చదువు కోసం వెళ్లి.. ఆస్పత్రి పాలై..

**కలుషిత ఆహార ఘటనలో అధికశాతం బాధితులు కొయ్యూరు మండలం వారే**

**కొయ్యూరు:** కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని క్రైస్తవ మిషనరీలో కలుషిత ఆహారం తినడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన వారిలో మండలానికి చెందిన 28 మంది ఉన్నారు. వీరిలో డౌనూరు పంచాయతీ రెల్లల పాలెంలో ఎనిమిదేళ్ల విద్యార్థిని గెమ్మెలి నిత్య (భవాని) సోమవారం తెల్లవారుజామున ఇంటివద్ద మృతి చెందింది.రెల్లలపాలెంకు చెందిన సీందరి రవి(8), తాంబేలి ఎలియా,(7), తాంబేలి ప్రభాస్(14), గెమ్మెలి చందు,(12), పార్లుబందకు చెందిన కొర్రా నాగేశ్వరి(12), మర్రి అలేఖ్య(9), గెమ్మెలి ధాన్యత'(6), గెమ్మెలి వంశీ(8), తాంబేలు శ్రీను(10), సీందరి చరణ్ (9), కిల్ల మహిమ(9), కిల్లో శైలు(6), గెమ్మెలి శంకర్రావు(14), తాంబేలు రాము(10), తాంబేలు నందిని(11), పాంగి సతీష్ (10), పాంగి అనురాధ(14), పాంగి లలిత(16), బూదరాళ్ల పంచాయతీ తూములోవకు చెందిన పాంగి అంజలి (11), పాంగి లావణ్య (7), పాంగి అనిత (7), పాంగి నందిని (8), పాంగి జగన్ (12), పాంగి శివాజి (11), అన్నవరానికి చెందిన కొర్రా సురేష్ (10), కొర్రా గణేష్ (11) తదితరులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. క్రైస్తవ మిషనరీ నుంచి వీరిని ఇళ్లకు తీసుకువచ్చారు. వీరందరినీ రాజేంద్రపాలెం, డౌనూరు పీహెచ్‌సీలకు తరలించారు. వీరితో పాటు చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పాటిబందకు చెందిన వంతల మేరి(9), వంతల సంధ్య(6), సీదరి కృష్ణ (7), ఎస్.లక్ష్మి (6), మూగబందకు చెందిన మర్రి కుమారి (6) ప్రథమ చికిత్స అందించారు. వీరిలో చింతపల్లి మండలానికి చెందిన ఐదుగురు మాత్రమే డౌనూరు పీహెచ్‌సీలో సోమవారం సాయంత్రం వరకు చికిత్స పొందారు. వీరిని కూడా ఉన్నత వైద్యం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న 8మందిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి సోమవారం రాత్రి తరలించారు.


వైద్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్

**విద్యార్థులకు పరామర్శ**

సమాచారం తెలుసుకున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హుటాహుటిన డీఎంహెచ్‌వో జమాల్‌బాషాతో కలిసి సోమవారం డౌనూరు పీహెచ్‌సీకి వచ్చారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. అవసరమైన వైద్యసేవలు అందిస్తామని వారికి ధైర్యం చెప్పారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తామని వారు పేర్కొన్నారు. విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో బ్రహ్మాజీరావు విద్యార్థులను పరామర్శించారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు, డౌనూరు హెచ్‌ఎం ప్రభుదాస్ వారి వెంట ఉన్నారు.

**ముగ్గురు మృతి బాధాకరం: కలెక్టర్ దినేష్‌కుమార్**

**సాక్షి,పాడేరు:** క్రైస్తవ మిషనరీలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన ఘటనలో జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందడం బాధాకరమని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న ఎనిమిది మంది విద్యార్థులను సోమవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవలు, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నుంచి తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకునేంత వరకు నిరంతరం పర్యవేక్షించి ఉన్నత వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్యసిబ్బందిని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అస్వస్థతకు గురైన వారిలో 59 మంది విద్యార్థులు జిల్లాలోని వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని,ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. వీరిలో 14 మందిని మెరుగైన వైద్యసేవల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. ఈ ఘటనలో మృతి చెందిన బలభద్రం గ్రామానికి చెందిన కొర్రా శ్రద్ధ ,నిమ్మలపాలెంకు చెందిన చెందిన తంబెలి జాషువ(7), రెల్లపాలెంకు గెమ్మెలి నిత్య(8) కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడారన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పీ ధీరజ్ బాధితులను పరామర్శించారు.


డౌనూరు ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

# కొండ దిగాలంటే.. లేఖ ఉండాల్సిందేనా?

- ఉద్యోగుల బదిలీలకు పైరవీల జోరు
- కోరిన చోటకు వెళ్లేందుకు ప్రయత్నాలు
- నిబంధనలు అమలుపై అనుమానాలు

**సాక్షి,పాడేరు:** ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాడేరు డివిజన్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన పలుశాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు మైదాన ప్రాంతాల బదిలీల ప్రక్రియలో పైరవీలు జోరందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 15 ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీలకు ఈ నెల 17న నోటిఫికేషన్ ఇవ్వడం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో కొండ దిగాలంటే ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తప్పనిసరి అన్న విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు అనేక ఇబ్బందులు పడి గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది.

**ముడుపులివ్వాలని ప్రచారం**

ఏజెన్సీలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు రెండేళ్ల సర్వీసు పూర్తి చేస్తే బదిలీలకు అర్హులు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత పలు జిల్లాల నుంచి పాడేరు డివిజన్‌లో ఉద్యోగాల్లో చేరిన అధికారులు, ఉద్యోగులు కూడా తమ సొంత ప్రాంతాలకు బదిలీకి మైదాన ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. కోరిన చోటకు బదిలీకి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు డిమాండ్ ఉందని తెలుస్తోంది.

**పారదర్శకం అమలయ్యేనా?**

గ్రామ సచివాలయాల్లో నూరుశాతం ఉద్యోగాలన్నీ స్థానిక గిరిజనులకే గత ప్రభుత్వం ఇవ్వడంతో వారంతా పాడేరు డివిజన్ పరిధిలోనే బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. మిగిలిన శాఖల్లో పనిచేస్తున్న గిరిజనేతర అధికారులు, ఉద్యోగులు మాత్రం విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పు గోదావరి ప్రాంతాలకు వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో బదిలీలకు సంబంధం లేదని, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ప్రభుత్వం పేర్కొంటున్నా.. పైరవీలకే ప్రాధాన్యం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

**అర్హులకు కోరిన చోటు కష్టమేనా..**

ప్రతిశాఖలో పదుల సంఖ్యలో ఉన్నారు. పంచాయతీ రాజ్ విభాగంలో మాత్రం ఎంపీడీవో నుంచి ఇంజినీరింగ్ అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు సుమారు 70 మంది వరకు బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఏజెన్సీలో ఐదు నుంచి ఏడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి దరఖాస్తు చేసుకున్న చోట పోస్టింగ్ తప్పనిసరిగా ఇవ్వాలి. ఇలా నిబంధనలు ఉన్నా పైరవీల కారణంగా వీరికి కోరిన చోటకు పోస్టింగ్ దక్కే అవకాశాలు తక్కువేనని వినవస్తోంది. ఏజెన్సీలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు కూడా కోరిన చోటకు వెళ్లేందుకు మైదాన ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేల లేఖల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆయా పోస్టులకు బదిలీ చేసేందుకు పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేస్తున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది.

## చుట్టుమెట్ట మలుపులో 108 వాహనం, కారు ఢీ


దెబ్బతిన్న కారు


ప్రమాదానికి గురైన108 వాహనం

**పెదబయలు:** మండలంలోని అరడకోట పంచా యతీ చుట్టుమెట్ట కాఫీ ప్లాంటేషన్ రెండో మలుపు వద్ద 108 అంబులెన్స్ వాహనం, కారు ఢీకొన్నాయి. స్థానికులు అందించిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం గలగండ పంచాయతీ సిరశపల్లి గ్రామం నుంచి రోగిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరుతూ ఫోన్ రావడంతో 108 సిబ్బంది వాహనంలో బయలుదేరారు. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళుతున్న కారు, 108 వాహనం మలుపు వద్ద ఢీకొన్నాయి. కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. మలుపు వద్ద రోడ్డు కిరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతోఎదురుగా వస్తున్న వాహనాలు సమీపంలోకి వస్తేగాని కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తుప్పలను తొలగించాలని స్థానికులు కోరారు.

## మన్యంలో భారీవర్షం

**సాక్షి, పాడేరు:** జిల్లా కేంద్రం పాడేరుతో పాటు పలు మండలాల్లో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం 9గంటల నుంచి సుమారు గంటన్నర సమయం పాటు కురిసిన భారీ వర్షంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాడేరు పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మార్గాల్లో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షం తగ్గిన తరువాత మళ్లీ భానుడు ప్రతాపం చూపాడు. సాయంత్రం మబ్బు వాతావరణం నెలకొంది.

# ఎమ్మెల్యే సారూ.. మాస్టారయ్యారు

- విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి
- మెనూ సక్రమంగా అందించాలి
- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- తురకలవలస ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


పాఠశాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

**పెదబయలు:** పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. పెదబయలు మండలంలోని గంపరాయి గ్రామ సచివాలయం పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు వెళ్లి సాంఘిక శాస్త్రం, గణితం తదితర సబ్జెక్టులలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థులు లక్ష్యంతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు, అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. గతంలో ఆయన ఉపాధ్యాయుడు కావడంతో ఈ సందర్భంగా విద్యార్థులకు సామాజిక శాస్త్రంలో పాఠాలను కొంతసేపు బోధించి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, ఇందులో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఏ ఒక్క పాఠశాల, హాస్టల్ నుంచి పౌష్టికాహారం అందడం లేదని ఫిర్యాదులు రావడానికి వీలులేదని, ప్రభుత్వ నిబంధనల అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ఎక్కువగా కృషి చేయాలని, ఇందుకోసం తల్లితండ్రులు ఉపాధ్యాయులకు సహకారం అందించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న దృష్టి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ మేరకు తరుచూ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించేలా హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలన్నాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సూచించారు.



## రోడ్డు ప్రమాదంలో తండ్రీ కుమార్తెకు గాయాలు


క్షతగాత్రులను పరామర్శిస్తున్న సర్పంచ్ గణలక్ష్మి

**రాజవొమ్మంగి:** నెల్లిమెట్ల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ,కుమార్తె గాయపడ్డారు. అడ్డతీగల సచివాలయ కార్యదర్శి లవకుమార్ తన కుమార్తెతో కలసి బైక్‌పై రాజవొమ్మంగి వస్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలో వారి బైక్‌కు ఓ కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు లాగరాయి పీహెచ్‌సీకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలేశ్వరం సీహెచ్‌సీకి వైద్యులు పంపారు. గాయపడిన వారు మండలంలోని కిర్రాబు గ్రామానికి చెందిన వారు. లాగరాయి సర్పంచ్ మిరియాల గణలక్ష్మి పీహెచ్‌సీకి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

## 30 వినతుల స్వీకరణ

**రంపచోడవరం :** స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 30 వినతులు స్వీకరించినట్టు పీవో కె. సింహాచలం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, డీఎల్పీవో రఘునందన్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, ఏడీఎంహెచ్‌వో శిరీష, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు రాజేంద్రబాబు, రామచంద్ర మూర్తి, మల్లికార్జునరావు, జీసీసీ డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, అదే సంస్థ మేనేజర్ రాజారెడ్డి, పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల మెరుగే లక్ష్యం

- ఐటీడీఏ పీఓ సింహాచలం


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

**రంపచోడవరం:** విద్యా ప్రమాణాల మెరుగుపరచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం సూచించారు. ఈ మేరకు ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సబ్జెక్టులపై ప్రావీణ్యం చెందే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని చెప్పారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని 11 మండలాలకు సంబంధించిన ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలతో, డీఎడ్ లెక్చరర్లతో, డీఎడ్ ప్రిన్సిపాల్‌తో విద్యార్థులకు బేస్ లైన్ టెస్ట్ ఏర్పాటుపై సోమవారం సమావేశం నిర్వహించారు.

**బేస్‌లైన్ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించాలి :** ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ విద్యా ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం మెరుగునకు మూడో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు బేస్ లైన్ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో మంచి ప్రావీణ్యం కలిగి ఉండే విధంగా విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు పాఠాలు చెప్పాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. రోజూ సకాలంలో ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకొని సకాలంలో అటెండెన్స్ వేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు భోజన సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం నిబంధనలను విద్యాశాఖ అధికారులు సిబ్బంది కచ్చితంగా పాటించాలని ఆయన అన్నారు. ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామతులసి, కృష్ణమోహన్, డిఎడ్ ప్రిన్సిపాల్ ఎం.చిన్నిబాబు, ఎంఈవోలు ఎం.వి.వి .సత్యనారాయణ, తాతబ్బాయి దొర, వై.చిన్నమల్లేశ్వరరావు, లక్ష్మయ్య, ఎస్.రాజులు, వి.వి.లక్ష్మీనారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఎంవో భాస్కరరావు, సీఎంవో జ్ఞాన ప్రకాష్, డిఆర్పీ మత్య కొండబాబు, డీఈఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణి తదితరులు పాల్గొన్నారు.

## చింతూరు ఏఎస్పీగా పంకజ్‌కుమార్

- బాధ్యతల స్వీకరణ



**చింతూరు:** స్థానిక పోలీసు సబ్ డివిజన్ ఏఎస్పీగా పంకజ్‌కుమార్ మీనా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన చింతూరు ఏఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

## వైభవంగా ఆలయ ప్రారంభం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే మత్స్యలింగం

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పండితులు హోమాలు నిర్వహించారు. అమ్మవారి ఘటాలను ఊరేగించిన అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దంపతులు 21 మందితో ప్రత్యేక పూజలు చేయించారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీగా అన్నసమారాధన నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిన ప్రశాంతతను ఇస్తాయన్నారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేయడం సంతోషకరమన్నారు. ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ సుభాష్‌చంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, ఆలయ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

**రంపచోడవరం:** ఏజెన్సీలోని ఈనెల 23న ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి అన్ని గ్రామాల్లో గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం చెప్పారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం ఏపీడీతో, డివిజనల్ పంచాయతీ అధికారితో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారితో ఏజెన్సీలోని గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలు ఏర్పాటుపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని ఈనెల 23న ప్రతి పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులు మంజూరుకు సభలు ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఉపాధి వేతనదారులకు వారి హక్కులను తెలియజేస్తామన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో చేపట్టనున్న పనలపై గ్రామసభ ద్వారా తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. మంజూరైన పనులు ప్రారంభించడానికి విధి విధానాలు గ్రామ సభలో తెలియజేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తాన్నారు. గ్రామ సభల నిర్వహణపై రెండు రోజుల ముందు దండోరా వేయించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టిన పనులు గ్రామ సచివాలయాల నోటీస్ బోర్డ్‌పై వివరాలు పొందుపర్చాలన్నారు. ఏజెన్సీలోని ఆయా గ్రామాల్లో కావలసిన పనులు గ్రామసభల్లో తీర్మానాలు చేసిన తరువాత ఆయా పనులు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మంజూరైన పనులకు ఏపీవోలు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని చెప్పారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ జి.శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి రఘునందన్, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్


సోదరుడికి రాఖీ కడుతున్న ఎంపీ తనూజారాణి


సోదరుడితోపాటు వైఎస్సార్‌సీపీ నేతలకు రాఖీ కడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



పాడేరులో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సీఆర్పీఎఫ్ జవాన్లకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



**బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో వేడుకలు**

**సాక్షి,పాడేరు/ముంచంగిపుట్టు:** రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోదరులకు అక్కచెల్లెమ్మలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆత్మీయతను చాటుకున్నారు. పాడేరులో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్‌కు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సీఆర్పీఎఫ్ జవాన్లకు కూడా వారు రాఖీలు కట్టారు.అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి సోదరుడు నేషనల్ ఇన్సూరెన్స్ విశాఖ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్‌కు రాఖీ కట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ముంచంగిపుట్టులో ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోదరుడు జగబంధు, వైఎస్సార్‌సీపీ నేతలకు ఆమె రాఖీ కట్టారు.